
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 13 ఆగస్టు 2024

పవిత్ర సంగమం మళ్లీ నాటి పవిత్రతను సంతరించుకోనుంది. కృష్ణా-గోదావరి నదీ సంగమంలో నవ హారతికి పూర్వవైభవం రానుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బ్రేక్ పడిన ఈ పవిత్ర కార్యక్రమాన్ని పునఃప్రారంభించేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నవ హారతులను ప్రారంభించడంతో పాటు నూతన ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నిత్యనూతనంగా.. నవ హారతి

ఫెర్రి వద్ద కృష్ణా-గోదావరి హారతి త్వరలో పునఃప్రారంభం



పవిత్ర సంగమం వద్ద నవ హారతులు (ఫైల్)



నవ హారతిపై మంత్రులు, కలెక్టర్ సమీక్ష

- మొత్తం ఆరు పంట్లు సిద్ధం చేస్తున్న అధికారులు
- పవిత్ర సంగమం వద్ద ఆలయం నిర్మాణానికి ప్రతిపాదన
- 2016 కృష్ణా పుష్కరాల్లోనే నవ హారతికి శ్రీకారం
- వైసీపీ వచ్చాక హారతుల కార్యక్రమం రద్దు
- కళావిహీనంగా మారిన సంగమ ప్రాంతం
- ఇన్నాళ్లకు మళ్లీ పునర్వైభవం దిశగా..

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నంలోని ఫెర్రి వద్ద గోదావరి-కృష్ణా పవిత్ర సంగమానికి మళ్లీ పూర్వవైభవం రానుంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016-అక్టోబరులో కృష్ణా పుష్కరాల సందర్భంగా పవిత్ర సంగమం వద్ద కృష్ణా నిత్య హారతుల కార్యక్రమాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. రాజమహేంద్రవరం వద్ద గోదావరి హారతిని స్ఫూర్తిగా తీసుకుని ఇక్కడ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పవిత్ర సంగమం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేశారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిత్యం నవ హారతులు ఇచ్చేవారు. నంది, ఓంకార, నాగ, కుంభ, సింహ, సూర్య, చంద్ర, పంచ, నక్షత్ర హారతులు ఇచ్చేవారు. 2019 వరకు ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగింది. నిత్యం వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి కృష్ణా హారతిని వీక్షించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కార్యక్రమానికి బ్రేక్ పడింది.

కళావిహీనంగా సంగమం

ఫెర్రి వద్ద కృష్ణా-గోదావరి నదులు కలిసే సంగమాన్ని పవిత్రంగా భావిస్తారు. అలాంటి సంగమం నుంచే దుర్గమ్మకు హారతులు అందజేస్తే మంచి జరుగుతుందన్న ఉద్దేశంతో ఇక్కడ నిత్య కృష్ణా హారతిని ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పవిత్ర సంగమం వద్ద హారతి కార్యక్రమాన్ని నిలిపివేయడంతో ఇక్కడకు వచ్చే పర్యాటకుల తాకిడి తగ్గింది. నిర్వహణ లేక పవిత్ర సంగమం కళ తప్పింది. నదిలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మెట్లు ధ్వంసమయ్యాయి. అతిథిగృహాలు నిరుపయోగంగా మారిపోయాయి. ఈ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.

పూర్వవైభవం దిశగా అడుగులు

పవిత్ర సంగమం వద్ద నెల రోజుల్లో 'కృష్ణమ్మ హారతి' కార్యక్రమాన్ని పునఃప్రారంభించనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి తెలిపారు. దీంతో ఈ ప్రాంతం పూర్వవైభవం సంతరించుకోనుంది. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పవిత్ర సంగమంలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించింది. పర్యాటకంగా కూడా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సమాయత్తమవుతోంది. ఇక్కడ తిరుమల తిరుపతి దేవస్థానం లేదా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఓ ఆలయాన్ని నిర్మించాలన్న యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కృష్ణా హారతి కోసం ఆరు పంట్లను ఏర్పాటు చేయనున్నారు. 10 సెట్ల హారతులు అవసరం ఉందని అధికారులు గుర్తించారు. 13 మంది అర్చకులు, వారికి సహాయకులుగా 20 మంది సిబ్బందిని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారులు సిద్ధం చేస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని, త్వరలోనే జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తిచేసి మిగిలిన పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ సృజన తెలిపారు.

నీటి కష్టాలు

కాలువగట్లు బలహీనంగా ఉండటంతో నీరు విడుదల చేయలేని పరిస్థితి



బందరు మండలం తుమ్మలచెరువు గ్రామంలో నీరులేక ఎండిన పొలాలు

- ఐదేళ్లుగా కనీస మరమ్మతులు చేయించని గత ప్రభుత్వం
- ప్రకాశం బ్యారేజీకి వచ్చిన వరద నీరంతా సముద్రంపాలు
- వర్షాలు లేకపోవడంతో సరిపడా సాగునీరందించలేని దుస్థితి

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో బలహీనంగా మారిన కాలువ గట్ల కారణంగా అధికారులు నీరు విడుదల చేయలేకపోవడం, వారం రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో కృష్ణాడెల్టా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవేళ నీటిని విడుదల చేసినా తూడు, గుర్రపుడెక్క, నాచు అడ్డుపడి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కృష్ణా డెల్టాలోని శివారు భూములకు సాగునీరు అందేలా కనిపించటం లేదు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కాలువల నిర్వహణ పనులను ప్రారంభించింది. ఆ పనులెప్పుడయ్యేనో.. సాగునీరు ఎప్పుడు అందేనో అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ కరుణించమంటూ వరుణుడిని వేడుకుంటున్నారు.

మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి: సరైన ప్రణాళిక లేకపోవడం, గత పాలకుల అలసత్వం కారణంగా కృష్ణాడెల్టా రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రధాన సాగునీటి కాలువలు, బ్రాంచ్ కాలువ గట్లను బలోపేతం చేయకపోవడంతో సాగునీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. దీనిపై నీటిపారుదలశాఖ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. కృష్ణానది నుంచి లక్షలాది క్యూసెక్కుల నీరు సముద్రంలో కలిసిపోతున్నా, శివారు ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేయండి మహాప్రభో అంటూ రైతులు మొత్తుకుంటున్నా నీటిని విడుదల చేయడానికి అవకాశం లేని పరిస్థితి నెలకొంది. వర్షం కురిసిన వెంటనే నీటి విడుదలను నిలిపేస్తుడటం, వారంపాటు వరుణుడు ముఖం చాటేస్తే జిల్లాలో సాగునీటి ఎద్దడి నెలకొనడం ఆనవాయితీగా మారింది. ఈ ఏడాది కోటి ఆశలతో సాగు ప్రారంభించిన రైతులకు సాగునీరు సక్రమంగా, సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువల నిర్వహణ పనులు ఆలస్యంగా ప్రారంభించడంతో నీటిని విడుదల చేసినా తూడు, గుర్రపుడెక్క, నాచు అడ్డుపడి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నాయి.

ఇదీ.. కాలువల పరిస్థితి

కంకిపాడు మండలంలోని పలు గ్రామాలకు బందరు కాలువ ద్వారా పునాదిపాడు, దావులూరు, పొద్దుటూరు, నెప్పల్లె, చలివేంద్రపాలెం తదితర గ్రామాలకు, రైవస్ కాలువ ద్వారా తెన్నేరు, మంతెన, ఉప్పులూరు, ఏల్చూరు, కోలవెన్ను, మానికొండ తదితర గ్రామాలతోపాటు దిగువ గ్రామాల్లోని భూములకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ రెండు ప్రధానకాలువలు, అనుబంధంగా ఉన్న బ్రాంచ్ కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, నాచు పేరుకుపోవడంతో పూర్తిస్థాయిలో నీటిని వదిలినా నీటి ప్రవాహం మందకొండిగానే సాగుతోంది. దీంతో భూములకు సరిపడా పెట్టుకునేందుకు సాగునీరందని దుస్థితి. ఇటీవల కోలవెన్ను తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పర్యటించినప్పుడు ఆయా గ్రామాల రైతులు పంట కాలువలు, డ్రెయినేజీల పరిస్థితులను వివరించి పనులను చేయించాలని కోరారు. వారం రోజులుగా పంటపొలాలకు సక్రమంగా సాగునీరు అందని దైన్యస్థితి నెలకొంది.

బలహీనంగా కేఈబీ కాలువ గట్టు

కేఈబీ కాలువ కింద 1.30 లక్షల ఎకరాలమేర ఆయకట్టు ఉంది. వల్లూరుపాలెం, శ్రీకాకుళం వద్ద కాలువగట్లు బలహీనంగా ఉన్నాయి. దీంతో నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఆలోచిస్తున్నారు. కేఈబీ కాలువకు అనుబంధంగా ఉన్న 9వ నెంబరు ప్రధాన కాలువకు 10 బ్రాంచ్ కాలువలున్నాయి. వీటికి వంతులవారీగా సాగునీటిని విడుదల చేస్తున్నా పొలాలకు పూర్తిగా అందట్లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు కాలువలకు సాగునీటి విడుదలను పర్యవేక్షించేవారు. కాలువకు శివారునున్న మోపిదేవి మండలంలోని పెదకళ్లేపల్లి, బందరు మండలంలోని వాడపాలెం, పెదయాదర, కోడూరు, నాగాయలంక మండలాల్లోని గ్రామాలకు సాగునీటిని అందించేందుకు సాయంత్రం 5 గంటల నుంచి ఎగువ ప్రాంతంలోని బ్రాంచ్ కాలువలకున్న తూములను కొంతవరకు కట్టేసేవారు. దీంతో శివారు వరకు కాలువల్లో నీటిమట్టం పెరిగి ఆయా భూములకు సాగునీరు అందేది. నాట్లు పూర్తయ్యేవరకు ఈ పద్ధతిని అవలంభించేవారు. ప్రస్తుతం ఈ పద్ధతిని పాటించకపోవడంతో దిగువ ప్రాంతాలకు సరిపడా సాగునీటిని అందించలేకపోతున్నారు. సోమవారం కేఈబీ కాలువ నుంచి 9వ నెంబరు కాలువకు 325 క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నా, అన్ని కాలువలకు నీటి విడుదల సక్రమంగా జరగటం లేదు. దీనికి అనుబంధంగా ఉన్న 9/3, 9/5, 9/7 కాలువలకు 3, 4 రోజులపాటు నీటిని విడుదల చేస్తామని, అవసరమైతే మరో రోజు అదనంగా నీటిని విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు.



ఇటీవల కురిసిన భారీవర్షాలకు బందరు కాలువగట్టు అంచు వరకు ప్రవహిస్తున్న నీరు

పూడికతీత పనులు చేయకపోవడం వల్లే

కృష్ణాడెల్టాకు ప్రధానంగా బందరు కాలువ, కేఈబీ కాలువ, రైవస్ కాలువ ఉన్నాయి. 60 శాతం వర్షం, 40 శాతం కాలువల నుంచే వచ్చేనీరు సాగుకు సరిపోతుందనే అంచనావేసి బ్రిటీష్ పాలకులు 150 ఏళ్ల క్రితమే ఆయా కాలువలను తవ్వారు. సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా వీటికి ఏటా కనీస మరమ్మతులు చేయాలి. తూడు, గుర్రపుడెక్క, నాచుల తొలగించే పనులను గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు పట్టించుకోలేదు. కాలువల నిర్వహణ పనులకు నిధుల విడుదల, ఈ ఏడాది ఎన్నికల కారణంగా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించే ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. కృష్ణాజిల్లాలో కాలువల నిర్వహణ పనులకు ఈ ఏడాది కేవలం రూ.25 కోట్లను మాత్రమే కేటాయించారు. కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేసేటప్పుడు 45శాతం లెస్‌కు టెండర్లు వేయడంతో పనులను ఎంతమేర సక్రమంగా చేస్తారనే అంశంపై ఇటీవల జరిగిన సాగునీటి సలహామండలి సమావేశంలో జిల్లాకు చెందిన శాసనసభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడం గమనార్హం.

కదలిక

23 మంది ఎంపీడీవోలకు పోస్టింగ్

మచిలీపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో పనిచేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర జిల్లాలకు ఈ ఏడాది ఫిబ్రవరిలో బదిలీపై వెళ్లి, తిరిగి మళ్లీ జిల్లాకు వచ్చిన 23 మంది ఎంపీడీవోలకు ఆయా మండలాలను కేటాయిస్తూ జడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎంపీడీవోలకు కేటాయించిన మండలాల వివరాలిలా ఉన్నాయి.

కృష్ణాజిల్లాలో..

ఏ లక్ష్మీదేవి (ఉయ్యూరు), ఎస్కే మెహబూబ్ సుభానీ (పమిడిముక్కల), జీ చంద్రశేఖరరావు (మొవ్వ), ఐ సత్యనారాయణ (తోట్లవల్లూరు), ఎన్ నాగలక్ష్మీ (చల్లపల్లి), బీ మురళీ శేషమాంబ (ఘంటసాల), ఈ మహేశ్వరరావు (ఉంగుటూరు), ఎం భారతి (పామర్రు), కే రత్నకుమారి (బాపులపాడు), జీవీఎస్ రామకృష్ణరాజు (బంటుమిల్లితోపాటు కృత్తివెన్ను మండలం అదనపు బాధ్యతలు) ఎన్ ప్రేమాన్విత (గూడూరు), కుంజా జ్యోతి (గుడివాడ), ఎంవీఆర్ కుమార్‌బాబు (పెనమలూరు)ను మండలాల్లో నియమించారు.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఏ శివపార్వతి (వీరులపాడు), ఏ దీప్తి (కంచికచర్ల), పీ ఉమాదేవి (ఇబ్రహీపట్నం), ఎన్ వెంకటేశ్వరరావు (చందర్లపాడు), ఏ శ్రీనివాసరావు (జి-కొండూరు), టీసీకేజే భరత్‌రాజ్ (వత్సవాయి), పీ శ్రీనివాస్ (మైలవరం), ఎస్ ఆశీర్వాదం (రెడ్డిగూడెం), జీ విజయకుమారి (విస్సన్నపేట), ఎం విశ్వనాథ్ (నందిగామ)ను మండలాల్లో నియమించారు.



రంగస్థల రారాజు ఆచంట

- తెలుగు భాషకు పద్య నాటకాలే ప్రాణం : వెంకయ్య నాయుడు
- తుమ్మలపల్లిలో ఆచంట వెంకటరత్నం కాంస్య విగ్రహావిష్కరణ

6లో..



శ్రీరామపాదక్షేత్రంలో సాధారణ స్థితికి చేరిన వరద

తగ్గిన ప్రవాహం

- దాదాపు 5 అడుగుల మేర తగ్గిన వరద నీటిమట్టం

అవనిగడ, ఆగస్టు 12: గత ఐదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా కృష్ణానదికి పోటెత్తిన వరదలు సోమవారం మధ్యాహ్నానికి తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. శనివారం సాయంత్రం పులిగడ్డ వద్ద ఆక్విడెక్ట్‌ను, నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం వద్ద కృష్ణవేణి మాత విగ్రహాన్ని తాకుతూ వరద ప్రవహించింది. దాదాపు 3 లక్షల క్యూసెక్కుల వరదనీరు ఆదివారం దిగువకు ప్రవహించగా, సోమవారం శ్రీరామపాదక్షేత్రంలో సాధారణ స్థితికి చేరుకుంది. మరో రెండు రోజులపాటు ప్రకాశం బ్యారేజీ నుంచి కనీసం 50వేల క్యూసెక్కుల మేర వరద రావొచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.

బ్యారేజీ ఇన్‌ఫ్లో 92,452, అవుట్‌ఫ్లో 78,500 క్యూసెక్కులు

విజయవాడ: ఎగువనున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల నిలిచిపోవడంతో పులిచింతల ప్రాజెక్టు గేట్లను కిందికి దించేశారు. ఇన్‌ఫ్లో లేకపోవడంతో సోమవారం ఉదయం ప్రాజెక్టు గేట్లను కిందికి దింపేశారు. ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టులో 35.23 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీకి ఉదయం 6 గంటలకు 95,625 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. మధ్యాహ్నానికి 92,452 క్యూసెక్కులకు తగ్గింది. బ్యారేజ్ గేట్లలో 40 గేట్లను రెండడుగులు, 30 గేట్లను అడుగు మేరకు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు 71,650, 3 గంటలకు 47,450, 6 గంటలకు 43,800, రాత్రి 9 గంటలకు 78,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాల్వలకు 13,952 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. కేఈబీకి 1601, బందరు 801, ఏలూరు 1404, రైవస్ 4619, కేఈమెయిన్ 8425, కేడబ్ల్యూకి 5527 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.





దుర్గగుడిలో హుండీల నగదు లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మకు హుండీ కానుకల ఆదాయం రూ.2,97,47,668

వన్‌టౌన్, ఆగస్టు 12 : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయంలోని మహామండపం 6వ అంతస్తులో సోమవారం లెక్కించారు. 18 రోజులకుగాను అమ్మవారికి కానుకల రూపేణా రూ.2,97,47,668 నగదు సమకూరింది. రోజుకు సగటున రూ.16,62,648 చొప్పున కానుకలు వచ్చినట్టుగా ఆలయ అధికారులు ప్రకటించారు. బంగారం 410 గ్రాములు, వెండి 5 కిలోల 280 గ్రాములు భక్తులు హుండీలలో సమర్పించారు. కాగా హుండీలలో విదేశీ కరెన్సీ 681 యుఎస్ఎ డాలర్లు, 875 ఆస్ట్రేలియా డాలర్లు, 20 ఇంగ్లండ్ పౌండ్లు, 3.5 ఓమన్ రియాల్స్, 9 బైంసాలు, 35 కెనడా డాలర్లు, 765 అరబ్ దిర్హమ్‌లు, 30 యూరోలు, 62 మలేషియా రింగ్గిట్స్, 107 సౌదీ రియాల్స్, 50 సౌతాఫ్రికా ర్యాండ్స్, 280 థాయిలాండ్ భట్స్, 17 కతార్ రియాల్స్ కానుకల రూపంలో వచ్చాయి. ఈవో కేఎస్ రామారావు, డిప్యూటీ ఈవో లీలాకుమార్, దేవదాయ శాఖ అధికారులు, ఏఈవోలు, ఆలయ సిబ్బంది, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది పర్యవేక్షణ చేశారు. ఆలయ సిబ్బంది అమ్మవారి సేవాదారుల బృందం లెక్కింపులో పాల్గొన్నారు. కాగా ఆన్‌లైన్ ఈ-హుండీ ద్వారా మరో రూ.56,320 కానుకలు వచ్చాయి.



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ సృజన, తదితరులు

అవగాహనతో హెచ్ఐవీ నివారణ

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



మొగల్రాజపురం, ఆగస్టు 12 : హెచ్ఐవీ పట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని, క్రమశిక్షణతో కూడిన జీవన విధానంతోనే ఆ మహమ్మారిని అరికట్టడం సాధ్యమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన చెప్పారు. జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో హెచ్ఐవీ అండ్ ఎస్టీఐ అవగాహనలో భాగంగా 'మీకు తెలుసా' పేరుతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, గత 30 సంవత్సలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన చర్యల వల్ల సమాజంలో హెచ్ఐవీ వ్యాప్తిని 86కు తగ్గించడం జరిగిందన్నారు. అప్పట్లో 'పులిరాజుకు ఎయిడ్స్ వస్తుందా' అన్న ఒక్క నినాదం ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకెళ్లిందన్నారు. ప్రస్తుతం 'మీకు తెలుసా' కార్యక్రమం ద్వారా ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుంది, ఎలా వ్యాపిస్తుంది, నివారణ మార్గాలు, వ్యాధి పరీక్షలు నిర్వహించుకోవడం, వైద్యసేవలు పొందడం, కండోమ్ వాడకం, వ్యాధి నివారణపై చర్చా గోష్ఠి నిర్వహించడం, టోల్ ఫ్రీ నెంబరు 1097 ద్వారా సహకారం పొందడం, వైరల్ లోడ్ తగ్గించడం, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక ప్రచార పద్ధతుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయంట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ మాట్లాడుతూ, 'మీకు తెలుసా' కార్యక్రమం ద్వారా ప్రతివారం ఒక థీమ్‌ను తీసుకుని 8 వారాల పాటు ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం పోస్టర్లను కలెక్టర్ విడుదల చేసి సభలో ప్రతిజ్ఞ చేయించారు. నృత్యరూపకాలు, ఫ్లాష్ మాబ్ ప్రదర్శించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిథులు పలు స్వచ్ఛంద సేవల సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

17 నుంచి ఐఆర్‌సీటీసీ యాత్ర

రైల్వేస్టేషన్, ఆగస్టు 12 : ఐఆర్‌సీటీసీ భారత్ గౌరవ ఎక్స్‌ప్రెస్‌లో ఈనెల 17 నుంచి సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్రను నిర్వహిస్తోంది. ఈమేరకు ఐఆర్‌సీటీసీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, సోమనాథ్, భీమశంకర్, త్రయంబకేశ్వర్, ఘుశ్నేశ్వర్, నాగేశ్వర్, ద్వారకా దేవాలయాలను ఈ యాత్ర కవర్ చేస్తుంది. విజయవాడలో ఈనెల 17న రైలు బయలుదేరనుంది. 28వ తేదీ వరకు 11 రాత్రులు, 12 పగళ్ల వ్యవధిలో యాత్ర సాగుతుంది. సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, మధిర, డోర్నకల్ జంక్షన్, మహబూబాబాద్, కామారెడ్డి, భోంగీర్, నిజామాబాద్, ధర్మాబాద్, ముద్‌కేడ్, నాందేడ్, పూర్ణస్టేషన్లలో హాల్ట్ ఉంటుంది. ఈ యాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలను ఐఆర్‌సీటీసీ, టూరిజం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. 9281030714, 92811495848 ద్వారా కూడా సంప్రదించవచ్చు. యాత్రలో పాల్గొనేవారు ఎకానమీ కేటగిరి స్లీపర్‌కు జీఎస్టీ సహా రూ.20,590, థర్డ్ ఏసీ రూ.33,015, కంఫర్ట్ కేటగిరి సెకండ్ ఏసీ కోసం రూ.43,355 చెల్లించవలసి ఉంటుంది.




ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న టీడీపీ, వైసీపీ నాయకులు

శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు

అవనిగడ్డ, ఆగస్టు 12 : అవనిగడ్డ-కోడూరు రహదారి నిర్మాణం కోసం వైసీపీ ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకం అనుమానాస్పదస్థితిలో ధ్వంసం కావటంపై నియోజకవర్గ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. అవనిగడ్డ-కోడూరు ఆర్ అండ్ బీ ప్రధాన రహదారి నిర్మాణం కోసం నాటి ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు శంకుస్థాపన చేయగా, సోమవారం ఉదయం శిలాఫలకం పడిపోయి కనిపించింది. దీనిని కావాలనే పడవేసి ఉంటారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి శిలాఫలకాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వైసీపీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గోరుముచ్చు ఉమా, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు కోరారు.

పడగొట్టే సంస్కృతి మాది కాదు : టీడీపీ నేతలు

శిలాఫలకాలు పడగొట్టే సంస్కృతి తమది కాదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా నేత బండే రాఘవ అన్నారు. శంకుస్థాపన శిలాఫలకం 20 రోజుల క్రితం పడిపోయి దానిచుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయని, శిలాఫలకాన్ని ఎవరో కావాలని పడవేశారని విమర్శలు చేయటం వైసీపీ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ప్రతీ విషయాన్ని రాజకీయం చేయటం మానుకోవాలని బచ్చు రఘునాథ్, యలవర్తి ఆది, కొల్లూరి ఇమ్మానియేలు తదితరులు హితవు పలికారు.

ఉయ్యూరులో అన్న క్యాంటీన్ పరిశీలన

▸ 15న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి



ఉయ్యూరు : ఉయ్యూరులో అన్నక్యాంటీన్‌ను ఈనెల 15 సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న నేపథ్యంలో స్థానిక శివాలయం రోడ్డులో పరిసరాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పెనలమలూరు, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాట్లపై సూచనలు చేశారు.

రంగస్థల రారాజు ఆచంట

▸ తెలుగు భాషకు పద్య నాటకాలే ప్రాణం : వెంకయ్య నాయుడు ▸ తుమ్మలపల్లిలో ఆచంట వెంకటరత్నం కాంస్య విగ్రహావిష్కరణ



కళాకారిణి నృత్య ప్రదర్శన

విజయవాడ కల్చరల్, ఆగస్టు 12 : తెలుగు సినీరంగంలో ఎన్టీఆర్ రారాజు అయితే.. తెలుగు రంగస్థలంలో ఆచంట వెంకటరత్నం నాయుడు రారాజు అని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అభివర్ణించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలో సోమవారం ప్రముఖ రంగస్థలనటుడు కళారత్న, అచంట వెంకటరత్నం నాయుడు కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆచంట వెంకటరత్నంనాయుడు వందకు పైగా వివిధ రకాల పాత్రలు పోషించి అద్భుతంగా నాడు రాణించారని కొనియాడారు. ఆచంట విగ్రహావిష్కరణకు మారుమూల ప్రాంతాల నుంచి తరలివచ్చిన పద్యనాటక ప్రియులను చూస్తే తెలుగు పద్య నాటకానికి మరింత భవిష్యత్తు వుందనే విషయం తెలుస్తుందన్నారు. తెలుగు భాష బ్రతకాలంటే ప్రత్యేకంగా ఏమీ చేయాల్సిన అవసరం లేదని, ఇంట్లో తల్లిదండ్రులు పిల్లల చేత తెలుగు మాట్లాడిస్తే సరిపోతుందన్నారు. పిల్లల్ని ఇంగ్లీషు మీడియంలో చేర్పించి ఇంట్లో ఇంగ్లీషులోనే మాట్లాడాలని షరతు పెట్టినప్పుడు భావితరాలు తెలుగు భాషకు దూరమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు మదర్ టంగ్ అని, తమిళం, మళయాళం ఇలాంటి భారతీయ భాషలు బ్రదర్ టంగ్ అని, ఇంగ్లీష్ అదర్ టంగ్ అని చలోక్తి విసిరారు. తనకు పౌరాణిక తెలుగు పద్యాలు అంటే ఎంతో ప్రీతికరమని, రంగస్థలం నటుడు పద్మశ్రీ ఎడ్ల గోపాలరావును వేదికపైకి ఆహ్వానించి తనకి ఇష్టమైన సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకంలోని పద్యాలని అడిగి మరీ పాడించుకొని సంతోషభరితులయ్యారు. కందుల దుర్గేష్ సాంస్కృతికశాఖ మంత్రిగా పరిపూర్ణ న్యాయం చేయగలరనే నమ్మకం తనకు వుందన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, కవులు, కళాకారులు, రచయితల సమస్యలు, వారి సంక్షేమానికి.. సాంస్కృతిక శాఖ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాజమండ్రి దేవీచౌక్‌లో ఒక విజయదశమి నాడు పౌరాణిక పద్య నాటకాలు ఏర్పాటు చేయగా వేలాది మంది ప్రేక్షకులు తరలివచ్చారని, వేదికపై రాజకీయ ప్రసంగాలు చేయబోయిన నాయకులను 'పద్యనాటకాలు చూడటానికి వచ్చామని, మీ ప్రసంగాలు కోసం కాదని' ప్రేక్షకులు అడ్డుకున్నారని గుర్తుచేశారు. నాటి నుంచి ప్రతిభ కల నాటకాలు ప్రదర్శిస్తే ప్రజలు ప్రోత్సహిస్తారనే నమ్మకం కలిగిందన్నారు. వాటిని ఆచరణలో పెట్టడానికి నాకు అవకాశం వచ్చిందన్నారు. సభాధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, తెలుగు కవులు, రచయితలు, కళాకారులకు గత ప్రభుత్వంలో ఏ విధమైన ఆదరణ లభించలేదని, వాళ్లందరూ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి చొరవ తీసుకొని రావాల్సిన రూ.4 కోట్ల పాత బకాయిలను చెల్లించేలా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా తెలుగు దేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏడు అకాడమీలకు తిరిగి పునరుజ్జీవం చేసే బాధ్యత మంత్రి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతి సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు, అంబటి మధు మోహనకృష్ణ, వేముల హజరత్తయ్య గుప్తా, సిల్వెస్టర్, చివుకుల హరగోపాల్, రావి వెంకట్, చింతా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. బి.రూపశ్రీ, జీఎన్‌డీ కృష్ణసాయిలు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. ప్రముఖ రంగస్థల నటుడు పీవీఎస్ కృష్ణ ప్రదర్శించిన మయసభలోని దుర్యోధన ఏకపాత్రాభినయం రక్తికట్టించింది.



తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలో అచంట వెంకటరత్నం నాయుడు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన వెంకయ్యనాయుడు, చిత్రంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు

మీకోసం అర్జీలు పరిష్కరించండి

▸ కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమంలో అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. 'మీకోసం' కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపుహాలులో అధికారులతో కలిసి ప్రజలనుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ శాఖల్లో కోర్టు ధిక్కరణ కేసులు ఎనిమిది ఉన్నాయని, వాటికి ప్రాథమికదశలోనే కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. ఈనెల 20వతేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించే పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. నులిపురుగుల నివారణ మాత్రలను పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు పంపిణీని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. మీకోసం కార్యక్రమంలో 94అర్జీలను ప్రజలు సమర్పించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, ఆర్డీవో ఎం.వాణి, జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఎస్‌వో పార్వతి, డీపీవో నాగేశ్వరనాయక్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, సీపీవో గణేష్ వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ

రెవెన్యూ సదస్సులు నిర్వహించండి

జిల్లాలో ఈనెల 15వతేదీనుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సోమవారం జూమ్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీసర్వే జరగని, భూమిసమస్యలు అంతగాలేని గ్రామాల్లో తొలివిడతగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. భూమి విభజన, సబ్‌డివిజన్ చేయడం తదితర అంశాలపై అర్జీలు వస్తాయని, వీటిపై ప్రధానంగా దృష్టిసారించాలన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సహజ వనరులను కాపాడుకుందాం

▸ నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టు సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 12 : రాష్ట్రంలోని ఐదేళ్ల వైసీపీ పాలనలో దోచుకున్న వనరుల పరిరక్షణపై దృష్టి సారిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఢిల్లీలో నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టు సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. కేంద్ర గనులు, బొగ్గు శాఖామంత్రి కిషన్‌రెడ్డి, అణుశాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్, కేంద్ర మైనింగ్ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్రదూబేల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రవీంద్ర మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితిని వివరించారు. రాష్ట్రంలో అపారమైన సహజ, విభిన్నమైన ఖనిజ వనరులు ఉన్నాయని, వాటిని సరైన మార్గంలో వినియోగించుకుంటే రాష్ట్రాభివృద్ధి చెందుతుందన్నారు. మినరల్స్ తవ్వకాలకు 2 శాతం సినరేజి ఫీజు నిర్ణయించారన్నారు. ఆ సొమ్మునే రాష్ట్ర ఖనిజ అన్వేషణకు వినియోగిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని మైనింగ్ కార్యకలాపాలపై సమగ్ర నిఘా కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాయం కావాలని కేంద్ర గనులుశాఖ కార్యదర్శి కాంతారావును కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు 972 కి.మీ తీర ప్రాంతం ఉందని, తీరప్రాంతంలో వనరుల అన్వేషణకు కేంద్రం సహకరించాలన్నారు. పాలీమెటాలిక్ నోడ్యూల్స్, పాలీమెటాలిక్ సల్ఫైడ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆఫ్‌షోర్ మైనింగ్ యాక్టు 2002కు సవరణలు వచ్చాయన్నారు. ఆఫ్‌షోర్ ఖనిజాలు ఉన్న ప్రాంతాలను వేలం వేయడానికి కేంద్ర ప్రభుత్వం వీలు కల్పించడంపై చర్చించారు. ఆఫ్‌షోర్ మైనింగ్ వేలంలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకుగాను సిబెడ్ మైనింగ్ కార్పొరేషన్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. ఈ సందర్భంగా అస్సాం మైన్స్ అండ్ మినరల్ డెవలప్‌మెంట్ శాఖా మంత్రి జోగల్ మోహన్, చత్తీస్‌ఘడ్ ఆరోగ్య శాఖా మంత్రి శ్యామ్‌బీహారీ జైస్వాల్, గుజరాత్ పరిశ్రమల శాఖా మంత్రి బల్వంత్‌సింగ్ రాజ్‌పుత్‌లతో మంత్రి రవీంద్ర చర్చలు జరిపారు.

లక్ష్యాల సాధనపై దృష్టి సారించండి

▸ ఉపాధి హామీ, రెవెన్యూ సదస్సులు, ఈ-పంట నమోదుపై దృష్టి పెట్టండి

▸ సమన్వయంతో గ్రీవెన్స్‌ను పరిష్కరించండి

▸ బడిఈడు పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా

కృష్ణలంక, ఆగస్టు 12 : ఉపాధి హామీ పనుల లక్ష్యాల సాధన, రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఇ పంట నమోదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, శాఖల సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, బడిమానిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులకు సూచించారు. ఉపాధి హామీ, రెవెన్యూ సదస్సులు, గ్రీవెన్స్ పరిష్కారం, డ్రాప్ అవుట్ పిల్లల గుర్తింపు, ఇ-పంట, హౌసింగ్, విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్ తదితర అంశాలపై సోమవారం జిల్లా కలెక్టర్ జి.సృజన నగరంలోని విడిది కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో కలిసి డివిజన్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల నిర్వహణలో నిర్దేశించిన లక్ష్యాల సాధనపై క్షేత్రస్థాయిలో అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలన్నారు. అంతర్‌శాఖలు, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో ప్రజాసమస్యలను నిర్దిష్టమైన స్పష్టతతో పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో జిల్లా జాయింట్‌కలెక్టర్ నిధిమీనా, అసిస్టెంట్ కలెక్టర్ శుభం కుమార్, డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డీఆర్వో వి.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఈఓ యు.వి.సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎ.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డీవీ రమణ, హౌసింగ్ పీడీ రజని కుమారి, డీఎస్‌వో మోహన్‌బాబు, జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్.నాగమణెమ్మ, డీపీవో శివప్రసాద్ యాదవ్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఉషారాణి, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వండి : జేసీ

కృష్ణలంక, ఆగస్టు 12 : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పారదర్శకంగా నిర్దిష్టమైన స్పష్టతతో అర్జీదారుడు సంతృప్తి చెందేవిధంగా శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జేసీ, అసిస్టెంట్ కలెక్టర్ శుభం కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలపై అలసత్వం ప్రదర్శించకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారుడు ఎదుర్కొంటున్న సమస్యలను బాధ్యతతో పరిష్కరించాల్సిన అవసరం వుందన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

100 టన్నుల ఇసుక స్వాధీనం



ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో డంప్ చేసిన ఇసుక

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 12 : ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాల్లో అక్రమంగా నిల్వ చేసిన 100 టన్నుల ఇసుకను సోమవారం రెవెన్యూ, పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని అనుమంచిపల్లి ఇసుక యార్డు నుంచి ట్రాక్టర్‌ల ద్వారా అక్రమంగా ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నిరుపయోగంగా ఉన్న రహదారుల్లో డంప్ చేస్తున్నారు. ఆ ఇసుకను రాత్రి వేళల్లో ఎస్కవేటర్‌లతో లారీలకు లోడ్ చేసి సరిహద్దులు దాటిస్తున్నట్టు సమాచారం. పట్టుబడిన ఇసుకను తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్టు ఆర్ఐ ఆనంద్ తెలిపారు.

అర్ధరాత్రి తెలంగాణాకు రవాణా..

వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఇసుక స్టాకు యార్డుల నుంచి ఆధార్ కార్డు చూపి తీసుకెళ్లే నిబంధన అక్రమార్కులకు వరంగా మారింది. అనుమంచిపల్లి యార్డు నుంచి ట్రాక్టర్ల ద్వారా జాతీయ రహదారికి అందుబాటులో ఉండే స్థలాలను గుర్తించి రాత్రి సమయాలలో తెలంగాణాకు తరలిస్తున్నారు. ఇసుక జాతీయ రహదారి పక్కనున్న ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాలలో అక్రమార్కులు డంప్ చేసేందుకు అనువుగా ఉంది. వైసీపీ హయాంలో నియమించబడిన పోలీస్, రెవెన్యూ అధికారులు ఈ ప్రాంతంలోనే విధులు నిర్వహిస్తుండటం కూడా అక్రమార్కులకు కలిసొచ్చింది. సరిహద్దులోని చెక్‌పోస్టు తెలంగాణా నుంచి రాష్ట్రంలోకి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తుంది తప్ప తెలంగాణా వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేయకపోవటం కూడా వరంగా మారింది.

లబ్ధిదారులకే అందించాలి..

ఉచిత ఇసుక రవాణాలో క్షేత్రస్థాయిలో విధివిధానాలు అక్రమార్కులకు లాభం కలిగిస్తుందనే ఆరోపణలు నెలకొన్నాయి. గత ప్రభుత్వంలో కోట్లు సంపాదించిన అక్రమార్కులు తిరిగి అదే పంథా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.

లైంగిక దాడి బాధితురాలికి అండగా ఉంటాం

▸ ఐసీడీఎస్ సీడీపీవో సంధ్యారాణి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

రంపచోడవరం, ఆగస్టు 12: విజయవాడలో లైంగిక దాడికి గురైన అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం గెద్దాడకు చెందిన గిరిజన యువతికి అండగా నిలిచి అవసరమైన రక్షణ కల్పిస్తామని రంపచోడవరం ఐసీడీఎస్ సీడీపీవో సంధ్యారాణి తెలిపారు. ఘటనపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో సోమవారం వచ్చిన వార్తకు మహిళా, శిశు సంక్షేమ శాఖ స్పందించింది. ఆ యువతికి రక్షణ కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలంటూ రంపచోడవరం ఐసీడీఎస్ సీడీపీవో సంధ్యారాణికి ఉన్నతాధికారుల నుంచి సూచనలు అందాయి. దీనిపై ఆమె విచారణ జరిపారు. వార్తలోని అంశాలను ధ్రువీకరిస్తూ, విజయవాడ మాచవరం పోలీసులు కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మంగినపూడి రైతులు

ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వండి

▸ కలెక్టరేట్ వద్ద మంగినపూడి రైతుల ధర్నా

▸ అనర్హులకు ఇచ్చారని ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 12 : పంటనష్టపోయి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిహారం కింద చెల్లించాల్సి ఉన్న ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని మంగినపూడి, కొత్తపూడి రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. రైతులు కనలింక నాగరాజు, తాతా శ్రీనివాసరావు, తాతా నగేష్, కసరిక శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ, మంగినపూడి, కొత్తపూడి గ్రామాల్లో నష్టపోయిన అర్హులైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని, అయితే అనర్హులకు, పొలం లేనివారికి, వ్యవసాయం చేయని కొందరి రైతులకు అక్రమంగా లక్షలాది రూపాయలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపితే అక్రమాలు వెలుగులోకి వస్తాయన్నారు. రైతులకు పునఃపరిశీలించి నష్టపరిహారం చెల్లించాలన్నారు.




నియమాక పత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

మానవహక్కుల సంఘం జోనల్ సభ్యుడిగా శ్రీనివాసరావు

జగ్గయ్యపేట, ఆగస్టు 12 : ప్రపంచ మానవహక్కుల అవగాహన సంఘం కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు జిల్లాల జోనల్ మెంబర్‌గా తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఇనుపనూర్తి శ్రీనివాసరావు నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన జాతీయ సదస్సులో ఈ నియామకం జరిగింది. మానవ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు భంగం కలిగినప్పుడు అండగా నిలిచి న్యాయం జరిగేలా చూస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

పార్టీ కోసం కష్టపడ్డాం.. గుర్తించండి

▸ లోకేశ్‌ను కలిసిన సునీతా, సతీష్ దంపతులు



జగ్గయ్యపేట : రెండున్నర దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న తమను గుర్తించి, సముచిత స్థానం కల్పించాలని రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార సంస్థ అధ్యక్షురాలు ఆచంట సునీత, సతీష్‌లు రాష్ట్ర మానవ వనరులు, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిసి కోరారు. ఎంతోకాలంగా పార్టీని నమ్ముకుని, అంకిత భావంతో పనిచేశామని, వైసీపీ రాక్షసపాలనకు వ్యతిరేకంగా నిరసన, ఆందోళనల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ సందర్భంగా తమకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	92, 101, 112
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

సొసైటీల ద్వారా యూరియా విక్రయించాలి

ఉప్పులూరు (కంకిపాడు), ఆగస్టు 12 : రైతులకు అవసరమైన యూరియాను ప్రభుత్వమే సొసైటీల ద్వారా విక్రయించాలని తెలుగురైతు జిల్లా కార్యదర్శి అన్నే ధన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ, నాట్లు పూర్తి చేసుకున్న రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో అవస రమైన యూరియాను సొసైటీల్లో ద్వారా విక్రయించాలన్నారు. సొసైటీల్లో నో స్టాక్ బోర్డులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సొసైటీలో రూ. 260కే విక్రయిస్తున్న యూరియాను బహిరంగ మార్కెట్‌లో రూ. 300 పైబడికి విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీలకు, బహిరంగ మార్కెట్‌లకు మార్క్‌ఫెడ్ ద్వారానే యూరియా సరఫరా అవుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో రైతులు, తెలుగురైతు నాయకులు పాల్గొన్నారు.

గన్నవరం డీఎస్పీగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

గన్నవరం, ఆగస్టు 12 : గన్నవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా చలసాని శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన జయసూర్య బదిలీపై భీమవరం వెళ్లారు. గన్నవరం డీఎస్పీగా చలసాని శ్రీనివాసరావును నియమిస్తూ డీజీపీ ద్వారక తిరుమలరావు ఆదేశాలు ఇవ్వటంతో బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు

మండలంలోని మాదలవారిగూడెం, చనుపల్లివారి గూడెం గ్రామాల్లో ఉన్న ఉద్యానవన పంటలను సోమవారం హార్టికల్చర్ అధికారి హరిచంద్ పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను ఉపయోగించుకోవా లని, ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. సబ్సిడీపై అందజేసే వీటిని తీసుకునేందుకు గ్రామ సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 5.73 లక్షలు

ఉయ్యూరు, ఆగస్టు 12 : జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ. 5.73 లక్షలు వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి వీడీడీ ప్రసాద్ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి వీఎస్ సుబ్రమణ్యం పర్యవేక్షణలో సోమవారం హుండీలు తెరచి లెక్కించగా ఆ మొత్తం ఆదాయం లభించినట్లు తెలిపారు.

నేడు జంక్షన్‌లో తిరంగ్ ర్యాలీ

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 12 : బీజేపీ ఇచ్చిన దేశవ్యాప్త హర్‌ఘర్ తిరంగ్ అభియాన్ పిలుపులో భాగంగా మంగళవారం హనుమాన్‌జంక్షన్‌లో వంద లాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ట్లు బీజేపీ కృష్ణాజిల్లా కార్యదర్శి సింగవరపు భాస్కర్ గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నిర్వహించనున్న ర్యాలీకి ముఖ్య అతిథిగా ఎంపీ వల్లభనేని బాలశౌరి, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు హాజరవుతున్నట్లు తెలిపారు.

16న బాపులపాడులో రెవెన్యూ సదస్సు

మండల కేంద్రమైన బాపులపాడులో ఈ నెల 16న తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సదస్సుకు జిల్లా స్థాయి అధికారులు హాజరవుతున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

అనధికార లే అవుట్లలో విద్యుత్ సర్వీసు తొలగించాలి

ఉయ్యూరు, ఆగస్టు 12 : ఉయ్యూరు మండలం గండిగుంట పరిధిలో గ్రామ పంచాయతీ గుర్తించిన అనధికార లే అవుట్లలో విద్యుత్ సర్వీసు కనెక్షన్లు తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. అనధికార లేఅవుట్లలో విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ డీఈకి ఏపీసీ ఆర్డీఏ కమిషనర్ గతనెల 4న ఉత్తర్వులు జారీ చేసినందున ఈ విషయమై గ్రామ పంచాయతీ గుర్తించిన సర్వే నంబర్లు 218, 219, 206పి, 216/2, 229/1, 312, 206, 258/2, 229/1లోని విద్యుత్ కనెక్షన్‌లు తొలగించేందుకు ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ తగుచర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు శ్రీనివాసగౌడ్ తెలిపారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

కంకిపాడు, ఆగస్టు 12 : పేదలకు అన్నం పెడుతున్న అన్న క్యాంటీన్‌ను కంకిపాడులో ఏర్పాటు చేయాలని పార్టీ మండల ఉపాధ్యక్షుడు పులి శ్రీనివాసరావు కోరారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రమైన కంకిపాడులో నిత్యం వేల సంఖ్యలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లి రెండవ దఫాలో అయినా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ బాజి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 12 : రాష్ట్ర అభివృద్ధి టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం యనమలకుదురులో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు బావుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జనసేన నేతలు ముప్పా రాజా, తాతపూడి గణేష్‌లతో కలిసి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి దివాలా తీయించిన గత సైకో ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. సర్వనాశనమైన వ్యవస్థలను గాడిలో పెట్టే పనిలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు నిమగ్నమయ్యారని, వారికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, వెలగపూడి బాబూరావు, అంగిరేకుల మురళి, అనం తనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, సంగెపు రంగారావు, పాదాల ప్రభాకర్, పీతా గోపీచంద్, ధనేకుల భార్గవ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : యార్లగడ్డ

గుణదల : తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేసి గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని ప్రసాదం పాడులో యాదవుల బజార్లో చర్చి వద్ద నుంచి జాతీయ రహదారి వరకు సిమెంట్ రోడ్ నిర్మాణానికి గాను భూమిపూజ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భూమి పూజ చేశారు. రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి రూ. 60 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. విజయవాడ రూరల్ మండలంలో ఒక్కొక్క సమస్య పరిష్కరించుకుంటూ వెళ్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు, జడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, ప్రసాదంపాడు సర్పంచ్ సర్నాల గంగారత్నం, ఉప సర్పంచ్ గూడ వల్లి నరసయ్య, ఎంపీటీసీ సభ్యురాలు గుజ్జర్లపూడి అనిత, పార్టీ నాయకులు బొప్పన హరికృష్ణ, గుజ్జర్లపూడి బాబూరావు, సర్నాల బాలాజీ, ఉల్లాస శివ, పరుచూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జెండా దిమ్మె ప్రారంభం

ప్రసాదంపాడు గ్రామానికి చెందిన యువ నాయకుడు సర్నాల బాలాజీ గ్రామంలో సహకార బ్యాంక్ వద్ద టీడీపీ జెండా దిమ్మెను ఏర్పాటు చేసి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. గ్రామంలో టీడీపీని బలోపేతం చేసేందుకు బాలాజీ విస్తృతంగా కృషి చేస్తున్నారు.





యనమలకుదురు నూతన బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న బోడె ప్రసాద్.. ప్రసాదంపాడులో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలి

ప్రముఖ మోటివేటర్ గంపా నాగేశ్వరరావు



నాగేశ్వరరావును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, హెచ్ఓడీ, డీన్ తదితరులు

పెనమలూరు, ఆగస్టు 12 : విద్యార్థులు తమ నైపుణ్యాలను, సృజనాత్మకతను పెంపొందించకోవడంతో పాటు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలని ప్రముఖ మోటివేటర్, ఇంపాక్ట్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి గంపా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం వీఆర్ సిద్ధార్థ, పీవీపీ సిద్దార్థ కళాశాలల్లో విద్యార్థులకు ఎంపవర్ అండ్ ఎన్‌రిచ్ అనే పేరుతో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నాగేశ్వరరావు జీవితంలో జరిగిన అనుభవాలను విద్యార్థులతో పంచుకొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు, హెచ్ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, కృష్ణశ్రీ, డీన్ శ్రీనివాస్, ఇన్‌చార్జిలు బేబీరాణి, నరేంద్ర, రవిచంద్‌లు నాగేశ్వరరావును సన్మానించారు.

విద్యార్థినులకు బస్‌పాస్‌లు పంపిణీ





విద్యార్థినులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు.. నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఉంగుటూరు, ఆగస్టు 12 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ బస్‌పాస్ సౌకర్యం కల్పించడం హర్షణీయమని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగంచేసుకుని చదువులో మరింత మెరుగ్గా రాణించాలని ఆత్కూరు జడ్పీహైస్కూల్ హెచ్ఎం. కేవీటీకే సుధాకర్ విద్యార్థులకు సూచించారు. చదువునిమిత్తం వివిధ గ్రామాల నుంచి స్థానిక జడ్పీ హైస్కూల్‌కు వస్తున్న సుమారు 159మంది విద్యార్థినులకు సోమవారం హెచ్ఎం ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ నాయకులు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆళ్ల నాగేశ్వరరావు, మరీదు శ్రీధర్, కొండేటి ఏడుకొండలు, ఉపాధ్యాయులు కొమ్మినేని మధుసూదనరావు, ఆర్టీసీ ఉద్యోగులు పరసా శ్రీనివాసరావు, సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ నగదు ప్రోత్సాహకాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ పోటీతత్వాన్ని పెంపొందించేందుకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్టు లయన్స్ సీనియర్ నాయకుడు బుచ్చిబాపయ్య తెలిపారు. అరుగొలను హైస్కూల్‌లో హెచ్ఎం దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు కళ్లేపల్లి నారాయణరావుతో కలిసి విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఉపాధ్యక్షుడు అక్కినేని రాఘవేంద్రరావు, జిల్లా అదనపు కార్యదర్శి నందింగం స్వామి, ఫణీంద్ర, మూల్పూరి సురేంద్రకుమార్, రవీంద్రనాథ్ చౌదరి, మాకినేని శ్రీనివాసరావు, తదితరులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు



విద్యుత్ వినియోగంపై సమీక్షిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఉంగుటూరు, ఆగస్టు 12 : మండలంలోని పలు గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై సోమవారం విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 46 బృందాలుగా ఏర్పడి 2477గృహసర్వీసులు, 164వాణిజ్యసముదాయాలు, 18ఇతర సర్వీసులను ఏకకాలంలో తనిఖీచేశారు. ఈ సందర్భంగా అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న 210 గృహసర్వీసులను గుర్తించి, వినియోగించిన 297కిలోవాట్స్ అదనపులోడుకు రూ.6,95,680/-లు అపరాధరుసుం(జరిమానా) విధించారు. విద్యుత్ విజిలెన్స్ తనిఖీల్లో గుడివాడ ఈఈ టి.రామకృష్ణ, హనుమాన్‌జంక్షన్ డీఈఈ బి.శ్రీనివాసరావు, ఉంగుటూరు ఏఈ ఏ.సూర్యప్రకాష్, గుడివాడ డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం మెనూ ఛార్జీలు పెంచాలి



ఎంఈవో-2 సాంబశివరావుకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ఉంగుటూరు, ఆగస్టు 12 : మధ్యాహ్న భోజన పథకం మెనూలో ప్రభుత్వం చేసిన మార్పులకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు కడవకొల్లు రామరాజు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం మండల సమావేశం సంఘ అధ్యక్షురాలు కోటేశ్వరి అధ్యక్షతన ఉంగుటూరులో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి మాట్లాడుతూ, ఇప్పటికైనా మెనూ అమలుకు అనుగుణంగా ప్రభుత్వం ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో-2 జే.సాంబశివరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అజ్మీర్ వెంకటేశ్వరరావు, సంఘ కార్యదర్శి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ఉయ్యూరు విద్యార్థులకు మెడల్స్



మెడల్స్ సాధించిన విద్యార్థులు

ఉయ్యూరు, ఆగస్టు 12 : మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ టీమ్ ఆధ్వర్యంలో విజయవాడలో చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆదివారం జరిగిన నేషనల్ లెవల్ కుంగ్‌ఫూ అండ్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్‌లో ఉయ్యూరు నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఇండియా విద్యార్థులు కటా, టీమ్ కటా, కుమితే(ఫైటింగ్) విభాగాల్లో విజయం సాధించి 17 బంగారు, 4 సిల్వర్, 2 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన విద్యార్థుల ను కోచ్ డి. శ్రీనివాస్ అభినందించారు.

అన్న క్యాంటీన్ ఏర్పాట్ల పరిశీలన



ఉయ్యూరులో ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ పరిసరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, ఆగస్టు 12 : ఉయ్యూరులో అన్న క్యాంటీన్‌ను ఈ నెల 15న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో స్థానిక శివాలయం రోడ్డులో పాత వాటర్ ట్యాంక్ సమీపాన అన్న క్యాంటీన్, పరిసరాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పలు ప్రభుత్వ శాఖల అధికారులతో కలసి సోమవారం పరిశీలించారు. పారిశుద్యం తదితర అంశాలపై నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావుకు పలు సూచనలు చేశారు. ఇతర ఏర్పాట్లపై మున్సిపల్ శాఖ అడిషనల్ డైరెక్టర్ అనూరాధ, ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు ఇతర శాఖల అధికారులకు సూచనలిచ్చారు. నగర పంచాయతీ చైర్మన్ వి.సత్యనారాయణ పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై కేంద్ర బృందం ఆరా



పురుషోత్తపట్నం పంచాయతీ కార్యాలయంలో కేంద్ర బృందం సభ్యులు

గన్నవరం, ఆగస్టు 12 : మండల, గ్రామస్థాయిలో అభివృద్ధి ప్రణాళికలపై కేంద్ర బృందం సభ్యులు ఆరా తీశారు. మండలంలో కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్స్ మిషన్‌లో భాగంగా గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో కేంద్ర బృందం సభ్యులైన ముఅజ్జామ్ అన్సారీ, ఎండీ కఫీల్ ఖాన్, సమ్యక్ లోహక రేలు సమావేశం అయ్యారు. అనంతరం పురుషోత్తపట్నం పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. అక్కడ సర్పంచ్ మాదల రోహిణితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో ఇ.సత్యకుమార్, సీడీపీవో పి.వెంకటలక్ష్మి, ఏపీఎం బి.మాధవి, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి కోట సురేష్‌బాబు, సచివాలయం కార్యదర్శి ఈశ్వర్, వీఆర్వో కొండబాబు పాల్గొన్నారు.



జీవో నెం.53 ప్రకారమే పదోన్నతులు కల్పించాలి

ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కంకిపాడు, ఆగస్టు 12 : ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులు జీవో నెం 53 ప్రకారమే జరపాలని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 53 ప్రకార మే పదోన్నతులు నిర్వహించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ భవన్నారాయణ, మండల విద్యాశాఖ అధికారి ఎస్.వి.విప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతర తెలుగు మాధ్యమం పునరు ద్ధరించాలని, ఉపాధ్యాయ పోస్టుల్లో సర్దుబాటును జీవో నెం. 117 ప్రకారం కాకుండా జీవో నెం. 53 ప్రకారం జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు మండవ శ్రీనివాసు, పచ్చిగళ్ల సురేష్ బాబు, బుచ్చయ్య బాబు, సీహెచ్ నారాయణమూర్తి, ముచ్చింతల శ్రీనివాసరావు, జోగిరాజు, ఏ. శ్రీనివాసమూర్తి, శొంఠి మాధవరావు, కే.బి.కే. గోపాల్, ఏ. విజయ్ కుమార్, పి. సాంబశివరావు, వివి. లావణ్య, పీడి ప్రసాదరావు, పామర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉయ్యూరు : రాష్ట్ర విద్యాశాఖ తలపెట్టిన అసంబద్ధ తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు బి.లంకేశ్, పీవీ రమణ అన్నారు. సర్దుబాటు ప్రక్రియ నిలిపివేసి ఫ్యాప్టో సూచినటువంటి సూచనలు పాటించి మెరుగైన విద్యా విధానం కొనసాగించాలని సమాఖ్య రాష్ట్ర నాయకత్వం పిలుపు మేర మండల విద్యాశాఖ అధికారి సుధారాణి, ఉపవిద్యాశాఖ అధికారి పద్మారాణికి సూచనలతో కూడిన వినతిపత్రం సోమవారం అందజేశారు.

గన్నవరం : ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ చాలా అసంబద్ధాలతో కూడుకుని ఉందని, ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన ఏ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించటం సరికాదని ఫ్యాప్టో నాయకులు అన్నారు. ఎంఈవో కార్యాలయంలో పని సర్దుబాటు కౌన్సెలింగ్‌ను బహిష్కరించి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మరీదు వరప్రసాద్, దేవరపల్లి విద్యాసాగర్ మాట్లాడుతూ, జీవో నెంబర్ 117ను రద్దు చేసి జీవో నెం-53 ప్రకారం ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలన్నారు. ఇది కూడా డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలన్నారు. నాయకులు దాసరి శివ ప్రసాద్, జి.రాజాబాబు, జి.రవిబాబు, జ్ఞానానందం, జేమ్స్, సురేష్, శ్రీధర్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు



గన్నవరం ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	92, 101, 112
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.80

నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళం



మోపిదేవి, ఆగస్టు 12 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన దొడ్డపనేని బసవపున్నారావు - లక్ష్మీ సుజాత దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. సోమవారం ఉదయం కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందజేశారు.

స్వచ్ఛ గుడివాడలో అందరూ భాగస్వాములు కావాలి



ఐ లవ్ గుడివాడ కార్యక్రమంలో వెనిగండ్ల

గుడివాడ, ఆగస్టు 12 : స్వచ్ఛ గుడివాడలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. సోమవారం 35వ వార్డులో ఐ లవ్ గుడివాడ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజావేదిక నుంచి 35వ వార్డు రాయలప్పారావు వీధి వరకు పరిసరాల పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రహదారుల వెంబడి చెత్తను తొలగించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాస్, అర్జున్, సురేంద్రబాబు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై సేవలందించాలి



పసుమర్రు సచివాలయంలో కుమార్‌రాజా

పామర్రు : ప్రజల సమస్యలను తీర్చడంలో సచివాలయ సిబ్బంది పాత్ర కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. పసుమర్రు గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్న తీరును పర్యవేక్షించారు. ప్రజలతో మమేకమై సేవలందించాలని సూచించారు. ఏఎంసీ వల్లూరిపల్లి గణేష్, గ్రామసర్పంచ్ కాకి నాగేంద్రం, కార్యదర్శి పద్మశ్రీవేణి, సచివాలయ ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు.

రైతుల పక్షపాతి చంద్రబాబు : గోపు

మచిలీపట్నం టౌన్ : వైసీపీ ప్రభుత్వం ఎగ్గొట్టిన ధాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం రైతులకు చెల్లించిందని టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. తన కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం రైతులకు రూ.1670 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉండగా పౌర సరఫరాల మంత్రి నాదెళ్ల మనోహర్ మొదట విడతగా రైతులకు రూ. 1000 కోట్లు, రెండో విడతగా రూ.674 కోట్లు చెల్లించారు. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్రలకు గోపు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు రైతుల పక్షపాతి అన్నారు. పోలవరం పూర్తి చేసే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు.

పొలాల పక్కన చెత్త వేయొద్దని వినతి



అవనిగడ్డ : ఎడ్లంకలో బందలాయి చెరువు ఎస్సీ కాలనీకి చెందిన విజయభాస్కర సొసైటీ పొలాల పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ జి.మురళీధర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. బడుగు జ్ఞానానందం మాట్లాడుతూ పంట పొలాలు పక్కనే స్థానికులు చెత్త, వ్యర్థ పదార్థాలు వేయటం వల్ల పందులు, కుక్కలు, పందికొక్కులు, ఎలుకలు వచ్చి పంట పొలాల్లో లాక్కెళ్లటం, పంటను నాశనం చేయటం వల్ల నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. చెత్త, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కి విన్నవించారు. సొసైటీ సభ్యుడు బి.శివకృష్ణ పాల్గొన్నారు.

333 సర్వీసు పునరుద్ధరించాలని వినతి

ఘంటసాల : విజయవాడ నుంచి ఘంటసాలకు ప్రతిరోజు ఉదయం 6.40 నిముషాలకు గతంలో నడిపిన 333 సర్వీసును పునరుద్ధరించాలని ఘంటసాల, మొవ్వ గ్రామాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. గవర్నర్‌పేట-2 నుంచి నడిచే 333 సర్వీసును తొలగించి దాని స్థానంలో పల్లె వెలుగు సర్వీసు నడపడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు తెలిపారు. ఉదయం, సాయంత్రం డ్యూటీలకు వెళ్లి రావటానికి 333 మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసు సౌకర్యవంతంగా ఉండేదన్నారు. ఆ సర్వీసును తొలగించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు 333 సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్‌కు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. మండల స్థాయి నేతలను కలిసి తమ సమస్యను వివరించారు.

చివరి భూములకు సాగునీరందించాలి

కోడూరు : కోడూరు మండలంలో చివరి భూములకు సాగునీరు తక్షణమే అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. కోడూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామకృష్ణాపురం, ఇరాలి, హంసలదీవి, ఉల్లిపాలెం, పాలకాయితిప్ప, సాలెంపాలెం, మందపాకల, పోటుమీద గ్రామాల్లోని చివరి భూములకు సాగునీరు అందించాలని నరసింహారావు కోరారు. మండలంలో అవుట్ ఫాల్ స్లూయిస్ వ్యవస్థ సరిలేక గత నాలుగు సంవత్సరాలుగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు వై.మధు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కరిముల్లా, సీపీఎం పార్టీ జిల్లా నాయకులు ఆవుల బసవయ్య, కోడూరు మండల కార్యదిర్శ పోలాబత్తిన మోహనరావు, కొప్పనాతి తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



చల్లపల్లి జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు

చల్లపల్లి, ఆగస్టు 12 : మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం (యాంటీ డ్రగ్స్ కార్యక్రమం) ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేశారు. డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేస్తామని విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. చల్లపల్లి జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయరాధిక, ఈవోఆర్డీ బూరేపల్లి అశోక్‌కుమార్, ఎస్సై సిహెచ్.చిన్నబ్బాయి, పంచాయతీ కార్యదర్శి పివి.మాధవేంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులతో కార్యదర్శి ప్రతిజ్ఞ చేయించారు. **ఘంటసాల :** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం (యాంటీ డ్రగ్స్ కార్యక్రమం) మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద సోమవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఘంటసాలపాలెంలో పంచాయతీ కార్యదర్శి బోలెం అర్జునరావు, సర్పంచ్ దోనె రజని, ఎంపీటీసీ సభ్యురాలు కొల్లూరి విజయ, టీడీపీ నాయకులు వేమూరి సాయి వెంకట రమణ పాల్గొన్నారు. ఘంటసాలలో పంచాయతీ సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, కార్యదర్శి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కొడాలిలో పంచాయతీ సర్పంచ్ చలపాటి రాణి, ఉపసర్పంచ్ తుమ్మల శంకరరావు, కార్యదర్శి సిహెచ్.వి.ఎస్.నాగమణి, జేఏ మురళీ, మల్లాయి చిట్టూరులో సర్పంచ్ ఆవుల రేవతి - ఆవుల ధర్మవెంకట నరసయ్య, ఉపసర్పంచ్ చింతల నాగబాబు, పంచాయతీ కార్యదర్శి నాగ శిరీష, చిట్టూర్పు పంచాయతీలో సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి కృష్ణవేణి, జేఏ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో ఎంపీడీవో సత్యనారాయణకు సత్కారం



మొవ్వలో చంద్రశేఖరరావుకు సత్కారం



పామర్రులో ఎంపీడీవో భారతికి సత్కారం

బదిలీ ఎంపీడీవోలకు సత్కారం

తోట్లవల్లూరు : ఎన్నికల విధులకు గుంటూరు జిల్లా కొల్లూరు మండలం నుంచి తోట్లవల్లూరు వచ్చిన ఎంపీడీవో సత్యనారాయణ సోమవారం రిలీవ్ అయ్యారు. సత్యనారాయణను కార్యదర్శులు పి.సత్యనారాయణ, శుభాష్, మండల సిబ్బంది శాలువాతో సత్కరించి నూతన వస్త్రాలను బహూకరించారు. కొల్లూరుకు వెళుతున్నట్లు సత్యనారాయణ తెలిపారు. **కూచిపూడి :** మొవ్వ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ గుంటూరు జిల్లా బదిలీ అయిన చంద్రశేఖర్‌రావుకు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సోమవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆయన చేసిన సేవలు కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కొండేటి ఇందిర, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **పామర్రు :** అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం బదిలీ అయిన ఎంపీడీవో భారతిని సోమవారం కార్యాలయంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రమీల, సుబ్రమణ్యం, అబ్దుల్ సలీం, పద్మశ్రీవేణి, ఆంజనాదేవి, లక్ష్మి, శ్రీరామ చంద్రమూర్తి, షాబుద్దీన్, నితిన్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా త్రినాథ్

గుడివాడ రూరల్ : గుడివాడ మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా టి.త్రినాథ్ బాధ్యతలు స్వీకరించారు. త్రినాథ్ సీనియర్ అసిస్టెంట్ పని చేస్తున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో కె.జ్యోతి సొంత జిల్లాకు సోమవారం బదిలీపై వెళ్లారు.



ట్రాఫిక్‌కు అవాంతరాలు సృష్టించొద్దు : ఎస్సై

గుడివాడ : రహదారులు వెంబడి చిరు వ్యాపారులు ట్రాఫిక్‌కు అవాంతరాలకు కారణం కావొద్దని ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్ సూచించారు.ప్రధాన రహదారుల వెంబడి ట్రాఫిక్‌కు కారణమవుతున్న తోపుడు బండ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చిరువ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించడం లేదని, రహదారిపై ఉన్న తోపుడు బండ్లు ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా పక్కకు మాత్రమే జరుపుతున్నామన్నారు. ట్రాఫిక్ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏఎస్సై రత్నరాజు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దు

గుడ్లవల్లేరు : నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాలకు ముప్పు కొనితెచ్చుకోవద్దని గుడివాడ మోటారు వెహికిల్ తనిఖీ అధికారి ఎం.సంగీతరావు అన్నారు. రహదారుల భద్రతపై గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ పి.కోదండ రామారావు, ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రి, గుడ్లవల్లేరు ఏఎస్సై సాంబశివరావు పాల్గొన్నారు.

ఏఎన్‌ఆర్‌లో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం

గుడివాడ : ఏఎన్నార్ కళాశాలలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు ముఖ్య అతిథిగా విచ్చేసిన కేటీఆర్ కళాశాల పూర్వ గ్రంథాలయాధికారి అనసూయ వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జె.ఎస్ కుమా ర్, వైస్ ప్రిన్సిపాల్, గ్రంథాలయాధికారి బి.ఎస్.ఎస్ పద్మజ, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్ఆర్‌కె ప్రసాద్, కార్యదర్శి కె.ఎస్. అప్పారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల తనిఖీ

పామర్రు : ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే సందర్భంలో తప్పని సరిగా రశీదులు తీసుకోవాలని పామర్రు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు బి.స్వర్ణలత పేర్కొన్నారు. ఎరువులు,పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి వి.శివనాగరాణి తో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఎరువులు ఈ-పోస్ మిషన్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. దుకాణాల్లో సరైనా పత్రాలు లేని ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు నిషేధించాల సూచించారు.

ఫార్మశీ విద్యార్థులకు అవగాహన

గుడ్లవల్లేరు : అడ్వాన్స్‌మెంట్ ఇన్ గ్రాన్యులేషన్ టెక్నిక్స్ ఫర్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ అనే అంశంపై గుడ్లవల్లేరు వి.వి.ఐ.పి.ఎస్ ఫార్మశీ కళాశాలలో జాతీయ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా పూనెకి చెందిన గ్లాట్ సిస్టమ్ ప్రైయివేట్ లిమిటెడ్ కంపెనీ సీనియర్ ప్రాసెస్ టెక్నాలజిస్ట్ జి.కిరణ్ కుమార్ పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.బాలకృష్ణ, డాక్టర్ పి.రవీషా పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, గుడివాడ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు ప్రారంభించారు. జంగం మోహనరావు, గాంధీ, అట్లూరి దిలీప్ కుమార్, వడ్లమూడి రవీంద్రబాబు, ప్రభాకరరావు, అమోద్య రామయ్య, అగ్నిహోత్రం ఫణిగోపాల్, పొట్లూరి రవికుమార్, చాపరాల బాలాజీ, వెనిగళ్ళ నాగేశ్వరరావు, వల్లూరుపల్లి వెంకటేశ్వరరావు, ఈడే మో హన్, తోట చిన్నారి, పేర్ని జగన్, బుల్లా కింగ్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు ఆదినారాయణ మృతి



కోడూరు, ఆగస్టు 12 : మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు బడే ఆదినారాయణ (చిన్నా) (78) సోమవారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆదినారాయణ మృతికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

నాగాయలంక మండల సమావేశం రేపు

నాగాయలంక : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ బోగాది రాఘవారాణి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో జె.వి.సీతారామ కుమార్ తెలిపారు. సర్పంచ్‌లు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాల్సిందిగా కోరారు.

కోడిపందేలు వేస్తున్న ఏడుగురి అరెస్టు

కూచిపూడి : అయ్యంకి గ్రామంలో కోడిపందాల శిబిరంపై కూచిపూడి ఎస్సై సుబ్రహ్మణ్యం నేతృత్వంలో సిబ్బంది దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.3460 నగదు, కోడిపుంజు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గుడివాడ రూరల్ : రూరల్ మండలం బిళ్లపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2620 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు.

ఆటో నుంచి జారిపడి బంగ్లాదేశ్ కూలీ మృతి



బంటుమిల్లి : పొట్టకూటి కోసం వ్యవసాయ పనులకు వెళుతూ ఆటో నుంచి కింద పడి బంగ్లాదేశ్‌కు చెందిన కూలీ అనుకూల్ చంద్రమండల్ (42) మృతి చెందాడు. బంగ్లాదేశ్‌కు చెందిన కొద్ది మంది యువకులు టూరిస్టు వీసాపై వచ్చి పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఉంటున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం తణుకు నుంచి నాగా యలంక గ్రా మానికి ఉదయాన్నే ఆటోలో బయలు దేరారు, డ్రైవర్ పక్కనే కూర్చు న్న చంద్రమండల్ అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తలకి తీవ్ర గాయమైంది. తోటి కూలీలు బంటుమిల్లిలోని ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం చేయించిన అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై గణేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలకు డిజిటల్ సౌండ్ సిస్టమ్, స్పీకర్ల వితరణ

ఘంటసాల : గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి, విశాఖపట్నంలోని సాయి రిసార్ట్స్ అధినేత దండమూడి రామకృష్ణ ప్రసాద్ రూ.50 వేల విలువ గల డిజిటల్ సౌండ్ సిస్టమ్, వైర్‌లెస్ స్పీకర్లను వితరణగా అందజేశారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అత్తలూరి గోపాలకృష్ణ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావుకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు వెంకట్రామ్ పరామర్శ

అవనిగడ్డ : పులిగడ్డలో లారీ డ్రైవర్ అద్దంకి ఏసుబాబు అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుమారుడు నాగసాయి మునిని మండలి వెంకట్రామ్ పరామర్శించి రూ.4 వేలు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామ ప్రముఖులు మెండు వెంకటేశ్వరరావును పరామర్శించారు. పులిగడ్డ పల్లెపాలెంలో ఇటీవల సైకం లక్ష్మీ మృతి చెందగా, వారి కుమారులు శేషుబాబు, గోపాలస్వామిలను పరామర్శించారు. మండలి రామ్మోహనరావు, మండలి దయాకర్, మండలి రామకోటి, నాగిడి రాంబాబు, మండలి సుధీర్, మండలి బలరాం, గుంటూరు వెంకటేశ్వరరావు,, చెన్ను శివాజీ, అద్దంకి రాంబాబు, నాగిడి వెంకటేశ్వరరావు, బొండాడ రామకృష్ణ, భోగాది రాఘవేంద్రరావు, భోగాది భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్

కోడూరు : మండలంలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఉప్పాల రాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ స్కాలర్ షిప్ అందజేశారు. ట్రస్ట్ అధినేత ఉప్పాల శ్రీనివాస్, యనమదుల మంజు ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐపీఎస్ మండల విష్ణువర్ధన్ రావు చేతులమీదుగా 12 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున చెక్కులు అందజేశారు. 2008వ సంవత్సరం నుంచి ప్రతీ ఏడాది విద్యార్థులకు స్కాలర్ షిప్ అందిస్తున్నట్లు తెలిపారు. యనమదల సుబ్బారావు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ త్రిమూర్తి మృతి

పెడన : మాజీ కౌన్సిలర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బళ్ల త్రిమూర్తి అనారోగ్యంతో చెన్నైలో మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని ఆయన స్వగృహానికి తీసుకురాగా, వైసీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము, మునిసిపల్ మాజీ చైర్మన్ బండారు ఆనంద ప్రసాద్, మాజీ వైస్‌చైర్మన్ కమాల్, మాజీ కౌన్సిలర్లు వన్నెంరెడ్డి మహంకాళరావు, మాదాసు బాబూరావు, వరుదు రామకృష్ణ, టీడీపీ నాయకులు చందన నారాయణరావు, బొడ్డు రామ్మూర్తి తదితరులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మచిలీపట్నం టౌన్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న బాలికల ఉచిత హాస్టల్ ఇంటర్ విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్‌ను సంస్థ అధ్యక్షుడు, స్టార్ కళాశాల డైరెక్టర్ శ్రీరామ్ అందజేశారు. అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతకు ముందు నోబుల్ కాలనీలోని పాఠశాలలో మొక్కలు నాటారు.

ఆక్రమణ తొలగింపు

పెడన : మెయిన్‌రోడ్డు మార్జిన్‌లో చర్చి పక్కన నిర్మించిన రేకుల షెడ్డును మునిసిపల్ అధికారులు సోమవారం తొలగించారు. ఒక వ్యక్తి రోడ్డు మార్జిన్‌లో సెం టు స్థలాన్ని ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మించాడు. ఈ విషయమై ఖుర్షిద్ బేగం అనే మహిళ స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా టీపీవో ఏసుబాబు సిబ్బందితో వెళ్లి రేకుల షెడ్డును తొలగించడానికి ఉపక్రమించారు. ఆక్రమణదారుడే స్వచ్ఛందంగా రేకుల షెడ్డును తొలగించాడు.

పంట నమోదుకు వివరాలు తెలియజేయండి

చల్లపల్లి : ఖరీఫ్ సీజన్ పంట నమోదు జరుగుతోందనీ, రైతులు తమ పొలం ఉన్న గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద వివరాలు తెలియచేయాలని చల్లపల్లి మండల వ్యవసాయశాఖ అధికారిణి జి.సాయిసింధు తెలిపారు. ఏవో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గ్రామ రైతు సేవాకేంద్రం వద్ద రైతు పొలం వివరాలు, పంట రకం, విస్తీర్ణం ఈ - పంట యాప్ ద్వారా నమోదు చేస్తారన్నారు. వరి, చెరకు, అరటి, పసుపు ఏ పంట వేసినా ఈ యాప్ ద్వారా నమోదు చేస్తారన్నారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా తీసుకుంటే పంట నమోదు వారి పేరుపై జరుగుతుందని తెలిపారు. సెప్టెంబరు 15వ తేదీ ఈ పంట నమోదుకు ఆఖరు తేదీ అని రైతులకు తెలిపారు.